# మర్యాద

"మహాలక్షుమ్మ గారు కనిపించారక్కయ్యా! మనింటికి రావాలని ఎన్నాళ్ళయిందో అనుకుంటున్నారట. ఇవాళ తప్పకుండా వస్తామన్నారు." అన్నది విమల, బజార్నించి తెచ్చిన చీరెలు చూపించడం అయిపోయాక.

"అబ్బా! విజయం చేస్తున్నామని మొదటే తెలియజేసిందన్నమాట. మరయితే ఆవిడ స్వాగతసత్కారాలకి తగిన ఏర్పాట్లు చేద్దాం ఇంక" అన్నది తన మామూలు ధోరణిలో మీనాక్షి. విమల నవ్వి ఊరుకుంది.

"నువ్వు రాకపోవడంవల్ల - ఆయనా నేనూ సెలక్టు చేస్తున్నా—ఏమిటో సరీగా చూశామో లేదో అనిపించిందక్కయ్యా! మహాలక్షుమ్మగారు పలకరిస్తూనే అన్నారు కూడాను 'మీ తోడికోడల్ని తీసుకురాలేకేం' అని."

"'మా మీనాక్షి మిమ్మల్ని చూడాలని మహాఇదై పోతూంది. ఒకసారి దయ చేయండి' అని చెప్పవలసింది విమలా!"

"అదేవిటక్కయ్యా! నువ్వావిడ నలా వేళాకోళం జేస్తున్నావుగాని, నిజంగా ఆవిడేమందో తెలుసా? 'నేనంటే మీనాక్షికి ఎంత పామరం! ఎంత అభిమానం! మీనాక్షిని చూడాలనివుంది. తప్పకుండా వస్తానని చెప్పు' అన్నదక్కయ్యా!"

విమల వివరిస్తూంటే మీనాక్షి చేతిలో పని ముగించుకొని చేతులు తుడుచుకుంటూ వచ్చి నిల్చుంది. మీనాక్షీ విమలా యిద్దరూ అక్కచెల్లెళ్ళని చాలామంది అనుకుంటారు. వాళ్ళ భర్తల్ని అన్నదమ్ములనుకుంటారు. ఒక బసలోనే రెండువాటాల్లోనూ ఎనిమిది సంవత్సరాలై కలిసి ఉంటున్నారు. ఊళ్లో చాలామంది వీళ్ళ అన్యోన్యాన్ని చూసి అక్కచెల్లెళ్ళనో, తోడికోడళ్ళనో భావిస్తూంటారు. మీనాక్షికీ విమలకీ స్వభావాల్లో ఎంత తేడా ఉన్నా ఐకమత్యానికి ఏ లోటూ లేదు.

"కాదు విమలా! వేళాకోళం చేయడం కాదుగాని ఆవిడ సిగ్గుమాలినతనానికి నవ్వు వస్తోంది. నిన్నగాక మొన్న వాళ్ళ అమ్మాయికి అంత అవమానం జరిగాక - తగుదునమ్మా అని ఈవిడ తలెత్తుకుతిరగడం చూస్తే నవ్వొస్తోంది."

"అందులో ఆవిడ తప్పేముందిఅక్కయ్యా! అయినా ఆవిడ సర్దుబాటు చేసి ఉండవలసిందిలే! అల్లుడుతో కాస్త మెల్లగా చెప్తే వినకపోతాడా!"

"ఆఁ మెల్లిగా చెప్పడం ఒకటి! ఈవిడ నోటుసంగతి మనకు తెలియదేమిటి విమలా! అల్లుణ్ణి ఎడాపెడా నాలుగు తిట్టి వుంటుంది కూడాను. ఆ కూతురు మాత్రం బుద్ధిమంతురాలా ఏఁవిటి! పెళ్ళికాకముందు ఎన్ని పుకార్లనీ! ఎరగని భాగోతాలా!"

"పోనీలే అక్కా! ఆ మాటలకేం గాని-వాళ్ల అల్లుడేమంత పెడసరం మనిషి కాడు. ఈ అమ్మాయి కొద్దిగా మంచిచూపిస్తే సరిపోతుంది! పాపం! కాపరం చెడగొట్టుకోవాలని ఆ అమ్మాయికి మాత్రం

## కన్నసామి

ఉంటుందా!"

"ఉండు. ఇప్పుడు వస్తుందిగా! చల్లగా జలకడిగేద్దాం!"

"మనకెందుకులే అక్కయ్యా! అయినా నీ కబుర్లు మనిషి ఎదురుపడేవఱకేనే!" అంటూ విమల నవ్వింది.

మీనాక్షి హఠాత్తుగా "అరుగో మాటలోనే వచ్చారు మాలక్షుమ్మపిన్ని. రండి పిన్నిగారూ, మీ మాటే అనుకుంటున్నాం. వెయ్యేళ్లు ఆయుష్షు," అన్నది. మహాలక్షుమ్మగారు లోపలికి వస్తూనే "చాలమ్మా! ఈ జీవిని ఇలా కడతేరనీ!" అన్నారు. "ఎంత మాట పిన్నిగారూ! ఇలా కూచోండి" అని మీనాక్షి చాపవేసింది.

మాలక్షుమ్మగారు మీనాక్షితో తావుల కొద్దీ భోగట్టాలు మాట్లాడేస్తున్నారు. విమల చేతిలో పనివున్నప్పుడు అవతలకి వెళ్లినా తగుమాత్రంగానైనా పాల్గొంటూనే వుంది.

మీనాక్షి -"అవును పిన్ని! అమ్మణ్ణి మరి అల్లుడు తీసికెళ్ళడం ఉందా," అన్నది.

"మీనాక్షి! వాణ్ని అల్లుడనకు. వాడో మనిషా? రాక్షసుడు! అయిగుమాసాలాయె ఇక్కడ అమ్మాయి ఏమైందో కనుక్కోవడమేనా లేదాయె."

"అవునమ్మా. అతని సంగతి ఎరక్కేం! దుర్వాసుడు. పాపం! అమ్మడు ఏఁవంటోంది?"

"ఏఁవంటుందమ్మా! దానికి వెళ్లాలని ఉంటుందిలేగాని, అతని పెడసరం చూస్తే నాకు ఒళ్ళు మండిపోతూందిసుమా! అమ్మడికి అసలే పడకుండావుంది. నేనూ అదేమిటో చూద్దాం, నాల్గురోజులుండమన్నాను."

"చూడు మాలక్షుమ్మ పిన్నీ! అమ్మడి సంగతి నాకు తెలియదూ! సీతమ్మలాటిది. దాన్ని బాధపెట్టి వాడేం సుఖపడతాడులే! వాడే వచ్చి నీ కాళ్ళమీద పడకపోతాడా!"

"మా తల్లే! అంతా నీలాటి బుద్ధిమంతులయితే ఎంత బాగుండును. అందరూ వాడి నోట్లో గడ్డిపెట్టి దారికి తీసుకువస్తారనే నా ఆశ."

విమల అందుకొని "అవునుగాని మాలక్షుమ్మపిన్నీ! అమ్మడు వచ్చినదగ్గర్నుంచీ

(55-వ పేజీ చూడండి)



# ★ మర్యాద ★

(15వ పేజీ తరువాయి)

మీరసలు అల్లుణ్ని రమ్మనీ పిల్లని తీసికెళ్ళమనీ రాశారా," అన్నది మామూలుగా.

"అదేమిటమ్మోయ్! విమలమ్మా! మా కౌమాత్రం తెలియదా ఏమిటి? పుట్టింటికి పంపించిన పెళ్లాన్ని మళ్లీ తీసికెళ్లాలన్న జ్ఞానం ఉండొద్దూ! అందుకు మేం వెళ్లి వాణ్ని అడుక్కోవాలా!"

"కాదు పిన్నిగారూ చూడండి! అతను తిక్క మనిషి అనే అనుకోండి. అతను తీసుకు వెళ్లాలనే అనుకోండి. అయినా మనం ఆడపిల్లవాళ్ళం గనక, కొంచెం మెల్లగా అడిగితే అతనుమాత్రం తీసికెళ్లడూ?"

"ఏమిటివిమలమ్మా! నా కూతురు కాపరం నేనే పాడుచేశాననా! నీఉద్దేశం?" అన్నది మాలక్షమ్మ తీవ్రంగా. విమల మెల్లగానే "కాదుపిన్నిగారూ! అమ్మడి కాపరంచక్కపడ్డం మనకి కావాలా—నువ్వంటేనువ్వని పట్టుదలలాఃపిల్ల అత్తారింటికి వెళ్లాలంటే— మీ అల్లుడేమంత మూర్ఖుడుకాదుపిన్నీ!"

మాలక్షమ్మగారు విమల ముఖం చూడలేక మీనాక్షివైపు తిరిగి—"చూడమ్మా,మీనాక్షీ! చివరకిలావొచ్చిందో. అసలేకూతుర్ని చూసి నామనస్సుముక్కలైపోతూంటే ఈవిడనే మాటలు చూశావా! పట్టుదలలకి నాకూతుర్ని నేనే పంపడం మానేశానుట. నువ్వేదో అప్యాయంగా మాట్లాడి నన్ను ఓదారుస్తావుంటే—ఈవిడకి ఒక మంచీ మర్యాదా లేదు. ఇంటికొచ్చాంగదా అని నానా మాటలూ ఆడుతోంది," అని ఉచ్చస్వరంతో ఆక్రోశించింది. గభాల్న ఉమ్మడి జాగాలోంచి లేచిపోయి మీనాక్షిగారికి ప్రత్యేకంగా ఉన్న గదిద్వారందగ్గర కూర్చుంది.

"చూడమ్మా, మీనాక్షీ! కొంచెం చదువుకోగానే కళ్లు నెత్తిమీదకెక్కి మర్యాద మరచిపోతారమ్మా! ఈవిడ పిలిస్తే నేనేమీ రాలేదు. నువ్వున్నావుకదా అనీ, నీకు మర్యాదామప్పిదం తెలుసుననీ వచ్చాను."

ఇలా మాలక్షమ్మగారు ఝూంమని ఊగిపోయారు. విమల మళ్ళీ నొకసారి "మాలక్షమ్మపిన్నీ! నేను మీకంటె చిన్నదాన్ని. నన్ను మీరు కోప్పడినా ఫరవాలేదు. కాని ఎవరివిషయంలోనైనా, నేనన్నవన్నీ నిజం" అన్నది. మాలక్షమ్మగారు వెళ్లిపోయేవఱకూ ఏదో గొణుగుతూనే ఉన్నారు. తర్వాత మీనాక్షి విమల దగ్గరకొచ్చింది. విమల కిటికీలోంచి బయటకు చూస్తూ నిల్చుంది.

"మనుషులకు అనుకూలంగా మాట్లాడి మర్యాదస్తులనిపించుకోవాలి విమలా! ఒకొక్కప్పుడు వాస్తవం చెప్పడంకూడా మర్యాదకాదు," అంది మీనాక్షి.

విమల 'హుఁ' అని నవ్వుకుంది. ★


త్వరితమైన, నిరపాయమైన, నిశ్చయమైన
**గృహస్థ దగ్గు నివారిణి**

ఊపిరి తిరగనీయకుండా బాధించే
పొడిదగ్గు నుండి ఉపశమనము పొందుటకు




Alembic

గ్లైకోడిన్
టెర్ప్-వసాకా

అలెంబిక్ కెమికల్ వర్క్సు కంపెనీ లిమిటెడ్, బరోడా-3

GVT 59.1 TE EVEREST